మీడియా సమావేశంలో మాట్లాడుతున్న ఆర్. నారాయణమూర్తి

# అక్టోబరు 6న 'యూనివర్సిటీ'

## విద్యారంగంపై ఆర్.నారాయణమూర్తి సినిమా ఆదరించాలని విజ్ఞప్తి

**ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి**

అక్టోబరు ఆరవ తేదీన 'యూనివర్సిటీ' సినిమాను విడుదల చేయనున్నట్టు సినీ నిర్మాత, దర్శకులు ఆర్.నారాయణమూర్తి తెలిపారు. అనంతపురం నగరంలోని ఎన్జీవో హోంలో జరిగిన మీడియా సమావేశంలో ఆయనతోపాటు కేంద్ర సాహితీ అవార్డు గ్రహీత బండి నారాయణస్వామి, ప్రముఖ రచయిత శాంతినారాయణ, విశాలాంధ్ర బుక్‌హౌస్ ఇంఛార్జీ ఈశ్వరరెడ్డి, మానవతా రక్తదాతల సంస్థ నిర్వాహకులు తరిమెల అమర్‌నాథరెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆర్.నారాయణమూర్తి మాట్లాడుతూ విద్యా,వైద్యం రెండూ సేవారంగాలని చెప్పారు. అయితే ఈ రెండింటినీ వ్యాపారమయంగా మార్చేసారని విచారం వ్యక్తం చేశారు. ప్రధానంగా విద్యా రంగం వ్యాపారాత్మకంగా మారిందన్నారు. పుట్టగొడుగుల్లా ప్రయివేటు సంస్థలు పుట్టుకొస్తున్నాయన్నారు. వీటి మధ్య పోటీ కారణంగా అనేక పెడధోరణలు నెలకొంటున్నాయన్నారు. ఈ ఇతివృత్తంతోనే పరీక్షా పేపర్ల లీక్ ఆధారంగా 'యూనివర్సిటీ' సినిమాను రూపొందించినట్టు తెలిపారు. దీనికి ప్రజలందరూ ఆదరించాలని విజ్ఞప్తి చేశారు. కేంద్ర సాహితీ అవార్డు గ్రహీత బండి నారాయణస్వామి మాట్లాడుతూ విద్యారంగంలో ప్రయివేటీకరణ కారణంగా అనేక పెడధోరణలు నెలకొంటున్నాయన్నారు. విపరీతమైన పోటీల కారణంగా సంస్థలు అనేక అనైతిక మార్గాలను అనుసరిస్తున్నాయని విచారం వ్యక్తం చేశారు. సమాజంలో నెలకొన్న అనేక రుగ్మతలకు వ్యతిరేకంగా సినిమాలను రూపొందించడంలో నారాయణమూర్తి ముందుంటారని అన్నారు. ఆయన తీసిన యూనివర్సిటీ సినిమాను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ప్రముఖ రచయిత శాంతి నారాయణ మాట్లాడుతూ నేడు విద్య వ్యాపారమయంగా మారిందన్నారు. ఈ ప్రయివేటు పోటీలో ఫలితాల వెంట అందరూ పరుగులు తీయాల్సి వస్తోందన్నారు. ముందున్నామని చెప్పుకునేందుకు ఈ ప్రయివేటు సంస్థలు అనేక రకాలైన వక్రమాలను అనుసరిస్తున్నాయన్నారు. తద్వారా కష్టపడి చదివిన విద్యార్థులు నష్టపోతున్నారని విచారం వ్యక్తం చేశారు. దీని ఆధారంగా రూపొందించిన ఆర్.నారాయణమూర్తి సినిమాను ఆదరించాలని కోరారు.

# తాగునీటి పథకాల కార్మికుల కష్టాలు కన్పించవా..?

అర్ధనగ్నంగా మోకాళ్లపై నిలబడి నిరసన వ్యక్తం చేస్తున్న తాగునీటి పథకం కార్మికులు

### ఆరునెలలుగా అందని వేతనాలు
### నిరవధిక సమ్మె చేస్తున్నా నిద్రలేవని పాలకులు
### కార్మికులపై బెదిరింపులకు దిగుతున్న అధికారులు

**ప్రజాశక్తి-హిందూపురం**

దాహం తీర్చే కార్మికులకు గత ఆరు నెలలుగా వేతనాలు అందక...జీవనం కష్టంగా మారడంతో వేతనాలు ఇవ్వాలని డిమాండ్ చేస్తు నీటి సరఫరా కార్మికులు ఆందోళనలు చేపట్టారు. కార్మికుల సమస్యలను పాలకులు, అధికారులు పరిష్కరించక పోవడంతో అటు శ్రీరామిరెడ్డి వాటర్ వర్క్స్, ఇటు సత్య సాయి వాటర్ వర్క్స్ కార్మికులు నిరవధిక సమ్మెకు దిగారు. అయినప్పటికీ తమకు ఏమి పట్టనట్లు అటు పాలకులు, ఇటు అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. వీరి నిర్లక్ష్యంతో కార్మికుల కుటుంబాలు గత ఆరు నెలలుగా ఆకలితో అలమటిస్తున్నాయి.

ఉమ్మడి అనంతపురం జిల్లాలోనే అతి పెద్ద నీటి ప్రాజెక్టులు శ్రీరామిరెడ్డి వాటర్ వర్క్స్, సత్య సాయి వాటర్ వర్క్స్ ప్రాజెక్టులు. ఈ ప్రాజెక్టుల ద్వారా వందలాది గ్రామాలకు వందలాది మంది కార్మికులు తాగునీటిని సరఫరా చేస్తున్నారు. సాధారణంగా దాహం వేసినప్పుడు ఒక గ్లాసు నీరు ఇచ్చిన వారిపట్ల కృతజ్ఞతా భావం చూపిస్తాం. అలాంటిది కొన్ని ఏళ్లుగా వందలాది గ్రామాలలో, వేలాది మంది ప్రజల దాహార్తిని తీరుస్తున్న సత్యసాయి వాటర్ వర్క్స్, శ్రీరామిరెడ్డి వాటర్ వర్క్స్ కార్మికులు ప్రస్తుతం ఆకలికేకలతో అలమటిస్తుంటే పట్టించుకునే అధికారులు, పాలకులు కరువయ్యారు. ప్రభుత్వం నుంచి నిధులు రావడం లేదు అని అధికారులు చెబుతున్నారు. అయితే కార్మికుల ఆకలి కేకలను నివారించేందుకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లను అధికారులు చేయడం లేదు. 1998 నుంచి అనంతపురం ఉమ్మడి జిల్లాలో వందలాది గ్రామాలకు సత్యసాయి తాగునీటి పథకం ద్వారా నీటి సరఫరాను చేస్తున్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా సుమారు 572 మంది కార్మికులు వివిధ కేటగిరీల కింద పనిచేస్తున్నారు. ఉమ్మడి జిల్లాల పరిధిలో ఏడు జోన్లు ఉన్నాయి. అందులో అనంతపురం, పుట్టపర్తి, కళ్యాణదుర్గం, తాడిపత్రి, గుత్తి, ధర్మవరం, ముదిగుబ్బ జోన్లు ఉన్నాయి. అనంతపురం జోన్‌లో 6 పంప్ హౌస్‌ల ద్వారా 31 గ్రామాలకు నీటి సరఫరా చేస్తున్నారు. పుట్టపర్తి జోన్‌లో 9 పంపు హౌసులు ఉండగా 40 నుంచి 50 గ్రామాలకు నీటి సరఫరా చేస్తున్నారు. ధర్మవరంలో 9 పంప్ హౌస్‌లు ఉండగా 78 గ్రామాలకు, ముదిగుబ్బ జోన్ 8 పంప్ హౌస్ లు ఉండగా 116 గ్రామాలకు, కళ్యాణదుర్గం జోన్‌లో 10 పంప్ హౌస్ లో ఉండగా 80 గ్రామాలకు, గుత్తి జోన్‌లో 9 పంప్ హౌస్ లో ఉండగా 15 గ్రామాలకు, తాడిపత్రిలో జోన్‌లో 12 పంప్ హౌస్ ఉండగా 91 గ్రామాలకు తాగునీటిని సరఫరా చేస్తున్నారు. కాగా ఇది వరకు సత్య సాయి తాగునీటి సరఫరాకు సంబంధించి ఒక బోర్డు జిల్లా కలెక్టర్ అధ్యక్షతన పనిచేస్తూ ప్రత్యేకంగా ఒక ఎస్ఇ, డిఇ ఈ స్థాయి అధికారులను సైతం బోర్డుకు నియమించారు. ఇదివరకు రోజుకు కోటి లీటర్ల నీటిని పంపింగ్ చేసి, గ్రామాలకు సరఫరా చేసేవారు. ప్రస్తుతం కేవలం 30 లక్షల లీటర్ల మాత్రమే పంపింగ్ చేస్తూ నీరు సరఫరా సాగిస్తున్నారు. రెండు దశాబ్దాలుగా నీటి పంపింగ్ యంత్రాలను వినియోగించిన కారణంగా అత్యధిక శాతం పంపులు మరమ్మతుకు గురై పనిచేయని కారణంగా పంపింగ్ చాలా వరకు తగ్గిపోయింది. దీంతో ఆ వచ్చే అరకొర నీటిని గ్రామాలకు సరఫరా చేస్తున్నారు. కాగా నీటి సరఫరాకు ఒక్కొక్క పంప్ హౌస్ దగ్గర పంపు ఆపరేటర్, రిగ్గర్, పంపింగ్ హెల్పర్, విలేజ్ ఆపరేటర్ అదేవిధంగా నైట్ సెక్యూరిటీల పేరుతో వారి వారి స్థాయిలో విధులు నిర్వహిస్తున్నారు. 2021 వరకు అప్పటి ప్రభుత్వాలు నామినేషన్ పద్ధతిలో వాటి నిర్వహణను ఎల్ అండ్ టి సంస్థకు అప్పగించేవారు. దీంతో వారు సత్యసాయి నీటి సరఫరా పథకానికి సంబంధించి బాధ్యతలు తీసుకొని నడిపేవారు. నిధుల సమస్య కారణంగా ఎల్ అండ్ టి వారు సత్యసాయి బోర్డుకు పూర్తి ప్రాజెక్టు స్వాధీనం చేసి తప్పుకున్నారు. అప్పగించే సమయంలో కార్మికులకు సంబంధించిన గ్రాడ్యుటి సొమ్మును సుమారు రూ.32 కోట్ల వరకు బోర్డుకే అప్పగించారు. సదరు గ్రాడ్యుటీ సొమ్మును కార్మికులకు చెల్లించాలని ఎల్ అండ్ టీ కోరగా ఆమేరకు అప్పటి ఉమ్మడి జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి అదే విధంగా ఎస్ఇ, డిఇలు ఒక ఒప్పందం చేసుకొని రాతపూర్వకంగా కూడా రాసి ఇచ్చినట్లు సమాచారం. అయితే ఎల్ అండ్ టి వారు తప్పుకున్నప్పటి నుంచి అడపాదడపా వేతనాలు ఇస్తూ వస్తున్నారని, పది నెలల పిఎఫ్, 18 నెలల ఈఎస్ఐ కి సంబంధించిన చెల్లింపులు అసలు జరగడం లేదని కార్మికులు వాపోతున్నారు. ఇక రెండు మూడు నెలలుగా రాష్ట్ర మంత్రులకు, ప్రభుత్వ ప్రత్యేక కార్యదర్శులకు, ఇతర ఉన్నతాధికారులకు పలుమార్లు వినతి పత్రం అందజేసినా సమస్య పరిష్కారం కాలేదని కార్మికులు, కార్మిక సంఘ నాయకులు అంటున్నారు. తమ సమస్యలకు పరిష్కారం చూపని కారణంగా చేసేదిలేక ఈనెల 24వ తేదీ అర్ధరాత్రి నుంచి నిరవధిక సమ్మెకు వెళుతున్నామని ప్రకటించి, కార్మికులందరు సమ్మెలోకి వెళ్లారు. అయితే విషయంపై అధికారులు మాట్లాడుతూ ప్రభుత్వం నుంచి నిధులు మంజూరు నిలిపివేయడం జరిగిందని. ఈ మేరకు ప్రభుత్వ చీఫ్ సెక్రటరీ నుంచి ఆదేశాలు అందాయని అంటున్నారు. గ్రామ స్థాయిలో పంచాయతీరాజ్ శాఖ, పట్టణ ప్రాంతంలో పురపాలక శాఖ నుంచే నిధులు వసూలు చేసుకుని కార్మికుల వేతనాలు, మోటార్ల మరమ్మతులు చేసుకోవాలని ప్రిన్సిపల్ సెక్రెటరీ ఇచ్చిన ఆదేశాలలో పేర్కొన్నట్లు అధికారులు చెబుతున్నారు. మరి ప్రభుత్వ ఉత్తర్వులు అనుసరించి పంచాయతీరాజ్, పురపాలక సంఘాల నుంచి నిధుల వసూలు సాధ్యమయ్యేనా, కార్మికుల ఆకలి కేకలు తీరేనా అనేది ప్రశ్నార్థకంగా మారింది.

ఇక శ్రీ రామిరెడ్డి వాటర్ సప్లయ్ స్కీమ్ ద్వారా ఉమ్మడి అనంతపురం జిల్లాలో 750 గ్రామాలకు నీటిసరఫరా జరుగుతూంది. గత 14 సంవత్సరాలుగా రాయదుర్గం, కల్యాణదుర్గం, ఉరవకొండ, మడకశిర, హిందూపురం నియోజకవర్గాల్లోని గ్రామాలకు లైన్మెన్, ఆపరేటర్, హెల్పర్లు, గ్యాంగ్‌మెన్‌లు ఇలా 500 మంది కార్మికులు పనిచేస్తున్నారు. వీరందరికి 4 నెలలుగా వేతనాలు, 9 నెలల ప్రావిడెంట్ ఫండ్ బకాయిలు చెల్లించాల్సి ఉంది. వీటిని చెల్లించాలని డిమాండ్ చేస్తు ఈ నెల 1వ తేదీ నుంచి 19తేదీ వరకు జిల్లా కలెక్టర్ కార్యాలయాల ముందు కార్మికులు రిలేదీక్షలు చేపట్టారు. ప్రభుత్వం స్పందించక పోవడంతో వీరు సైతం సమ్మెలోకి వెళ్లారు. మడకశిర నియోజకవర్గంలో గుత్తేదారుడు కలాంనాయుడు కార్మికులకు ఇవ్వవలసిన వేతనాలలో ప్రతి కార్మికుని నుండి రూ.3 వేలు వేతనాలలో కోత విధించి ఇస్తున్నారనిఇదేమని ప్రశ్నించే కార్మికులను స్థానిక ప్రజాప్రతినిధి వత్తాసుతో భయపెట్టి కార్మికుల శ్రమను నిలువునా దోచుకుంటున్నారని కార్మికులు విమర్శిస్తున్నారు. గత సంవత్సరంగా కార్మికులకు పి.ఎఫ్ బకాయిలు, వేతనాలు బకాయిలు చెల్లించాల్సుంది. హిందూపురం నియోజకవర్గంలో ఎ.ఎస్.ఆర్. ఇంజనీరింగ్ అండ్ ప్రాజెక్ట్ లిమిటెడ్ ఉంది. అయితే పుట్టపర్తి అధికార పార్టీ ఎమ్మెల్యేకి బినామిగా ఉన్నా గుత్తేదారుడు గోవర్ధన్ రెడ్డి సైతం కార్మికులకు ఇవ్వవలసిన వేతనాలలో రూ. 3వేలు కోతకోసి కార్మికులకు పి.ఎఫ్. చెల్లించకుండా అధికార పార్టీ అండతో ప్రశ్నించిన కార్మికులను తొలగిస్తామని భయపెట్టడం, ఇచ్చినపుడే వేతనాలు తీసుకోవాలని హుకుం జారీ చేయడం లాంటివి చేస్తున్నారు. ఇది తెలిసినప్పటికి కార్మిక శాఖ అధికారులు చర్యలు తీసుకోవడం లేదు. కార్మికులకు చెల్లిస్తున్న వేతనాల్లో 13శాతం గుత్తేదారులకు కమీషన్ ప్రభుత్వం చెల్లిస్తుంది. అయినప్పటికి గుత్తేదారులు కార్మికులను నిలువునా దోచుకుని వేతనాలు సైతం ఇవ్వకుండా నేడు రోడ్డున పడేశారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా దాదాపు 1500 మంది కార్మికులు వేతనాల కోసం నిరవధిక సమ్మె చేస్తున్నా అటు పాలకులు, ఇటు అధికారుల్లో కనీస స్పందనకనిపించడం లేదు.

### న్యాయం చేసే వరకు సమ్మె విరమించేది లేదు

గ్రామీణ, పట్టణ నీటి సరఫరా విభాగంలో పని చేస్తున్న కార్మికులకు న్యాయం జరిగే వరకు సమ్మె విరమించే ప్రసక్తేలేదు. ప్రభుత్వం కార్మికులకు ఇస్తున్న వేతనాల్లో కొంత మంది కాంట్రాక్టర్లు కోత విధించి అడ్డంగా దోచుకుంటున్నారు. ఆ డబ్బులు సైతం కార్మికులకు గుత్తేదారులు ఇవ్వాలి.

**జి ఓబులు**
**వాటర్ సప్లై కాంట్రాక్టు కార్మికుల స్టేట్ కన్వీనర్**

### ఆందోళనలు ఉధృతం చేస్తాం

నీటి సరఫరా విభాగంలో పని చేస్తున్న కార్మికుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించకపోతే ఆందోళన కార్యక్రమాలు తీవ్రతరం చేస్తాం. ఇస్తున్న వేతనాలు సక్రమంగా ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నప్పటికి పాలకులు పట్టించుకోవడం లేదు. ముఖ్యమంత్రి సంక్షేమ పథకాలకు ఎలా బటన్ నొక్కుతారో అదే విధంగా కార్మికుల వేతనాలకు బటన్ నొక్కాలి. లేని పక్షంలో 2024 ఎన్నికల్లో బటన్ ఎవరి నొక్కాలో కార్మికులకు తెలుసు.

**ఈఎస్ వెంకటేష్,**
**సిఐటియు జిల్లా కార్యదర్శి**

## కార్మికుల సమ్మెను అడ్డుకునేందుకు అధికారుల యత్నం

అధికారులతో మాట్లాడుతున్న నాయకులు, కార్మికులు

**ప్రజాశక్తి అనంతపురం కలెక్టరేట్**

శ్రీరామ్ రెడ్డి తాగునీటి సరఫరా పథకంలో పనిచేస్తున్న కార్మికుల నిరవధిక సమ్మెను ఆర్డబ్ల్యూఎస్ అధికారులు, పోలీసులు బలవంతంగా అడ్డుకునే ప్రయత్నం చేశారు. ప్రధాన పంపు మోటార్లను పోలీసులు బలవంతంగా ఆన్ చేశారు. దీన్ని వ్యతిరేకిస్తూ శ్రీరామ్ రెడ్డి కార్మికులు, సిఐటియు నాయకులు నిరసన వ్యక్తం చేసి మోటార్లను నిలుపుదల చేశారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్. నాగేంద్ర కుమార్ మాట్లాడుతూ బకాయి వేతనాలు, పిఎఫ్, ఈఎస్ఐ బకాయిలు, గ్రాడ్యుటీ చెల్లించాలని అనేకమార్లు అధికారులకు విజ్ఞప్తి చేసినా, శాంతియుత నిరసనలు చేపట్టిన, కార్మికుల సమస్యలు పరిష్కరించడంలో తీవ్ర నిర్లక్ష్యంగా వ్యవహరించారని విమర్శించారు. ప్రజలకు ఇబ్బంది కలగకూడదని ఇన్ని రోజులు వేతనాలు అందకపోయినా సమస్యలు ఎదుర్కొని కార్మికులు పనిచేస్తూ వచ్చారన్నారు. నెలలు తరబడి వేతనాలు రాకపోతే వారి కుటుంబాలు ఎలా గడుస్తాయని ప్రభుత్వం ఆలోచించాలన్నారు. గత్యంతరం లేని సమయంలో కార్మికులు నిరోధిక సమ్మెకు దిగాల్సి వచ్చింది అన్నారు. ప్రభుత్వం, అధికారులు కార్మికుల పక్షాన స్పందించి సమస్యలు పరిష్కరించాల్సింది పోయి సమ్మె విరమింపజేసే విధంగా కార్మికులను ఇబ్బంది పెట్టడం సరికాదన్నారు. తక్షణమే బకాయి వేతనాలు ఇతర సమస్యలను పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. అలా కాకుండా బలవంతంగా సమ్మె నిలుపుదల చేస్తామంటే సిఐటియుగా ఒప్పుకునేది లేదన్నారు. ప్రభుత్వం స్పందించకపోతే పోరాటాలు ఉధృతం చేయాల్సి వస్తుందని హెచ్చరించారు.

### ప్రధాన పంపు మోటార్లను ఆన్ చేసిన అధికారులు
### ప్రతిఘటించిన కార్మికులు, నాయకులు

అటవీ శాఖ కార్యాలయం ముందే సరిహద్దు దాటుతున్న కలప

# సరిహద్దులు దాటుతున్న అటవీ సంపద

**ప్రజాశక్తి - చిలమత్తూరు**

చిలమత్తూరు మండలం కర్నాటక బాగేపల్లి ప్రాంతానికి సరిహద్దు ప్రాంతం కావడంతో చిలమత్తూరు మండల నుండి పెద్ద ఎత్తున అటవీ సంపద సరిహద్దులు దాటుతున్నది. కర్నాటకలో చెట్ల నరికివేతకు పెద్దగా అడ్డంకులు లేవు. అయితే అక్కడ గృహోపకరణాలకు ఉపయోగపడే వేప వంటి చెట్లు లభించడం తక్కువ కావడంతో వాటికి గిరాకీ బాగా పెరిగింది. సరిహద్దు ప్రాంతంగా ఉన్న చిలమత్తూరులో అటవీ ప్రాంతం అధికంగా ఉండటంతో వేపతో పాటు గృహోపకరణాలకు ఉపయోగించే కలప అధికంగా లభిస్తుంది. దీంతో ఇక్కడి నుంచి పెద్ద ఎత్తున అటవీ సంపదను సరిహద్దులు దాటిస్తున్నారు. ఏకంగా అటవీశాఖ తనిఖీ కేంద్రం ముందు నుండే టన్నుల కొద్దీ అటవీ సంపద సరిహద్దులు దాటుతూంది. అయినప్పటికి అధికారులు ఏ మాత్రం పట్టించుకోక పోవడం పలు అనుమానాలకు తావిస్తోంది. ఇప్పటికైన ఉన్నత స్థాయి అధికారులు చొరవ చూపి అక్రమంగా తరలిస్తున్న అటవీసంపదకు కాపాడాలని మండల ప్రజలు కోరుతున్నారు.

## స్వయం సహాయక సంఘాల ఉత్పత్తులకు మార్కెటింగ్ సౌకర్యం

### ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్ రెడ్డి

**ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్**

స్టాల్స్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి

స్వయం సహాయక సంఘాల మహిళలు ఉత్పత్తి చేసిన వాటికి ప్రభుత్వం స్థానికంగానే మార్కెట్ సౌకర్యం కల్పిస్తుం దని ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి పేర్కొన్నారు. పట్టణంలోని గణేష్ సర్కిల్‌లో ఆదివారం ఏర్పాటుచేసిన ఆహా క్యాంటీన్‌తో పాటు మెప్మా ఆధ్వర్యంలో స్వయం సహాయక సంఘాలు ఏర్పాటుచేసిన 30 స్టాల్స్‌ను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగన్ పాలనలో సుస్థిర జీవనోపాధుల కల్పనలో భాగంగా మహిళా సంఘాల ఆధ్వర్యంలో ఈ స్టాల్స్‌ను ఏర్పాటు చేశామన్నారు. సంఘాల మహిళలు ఉత్పత్తులు చేసిన తిను బండారాలతో పాటు ఇతర వస్తువులను స్థానికంగానే మార్కెటింగ్‌లో విక్రయించుకునే అవకాశం ఏర్పడుతుందన్నారు. మహిళలు ఆర్థిక స్వావలంబన సాధించాలన్నదే ప్రభుత్వ లక్ష్యమన్నారు. ఈ మార్కెట్ సౌకర్యం మహిళలకు ఎంతో ఉపయోగమని, దీనిని సద్వినియోగం చేసుకొని తద్వారా అభివృద్ధి చెందాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ మధుసూదన్‌రెడ్డి, ఛైర్మన్ తుంగ ఓబుళపతి, పుడా ఛైర్‌పర్సన్ లక్ష్మీనరమ్మ, వైస్ ఛైర్మన్లు లక్ష్మీనారాయణరెడ్డి, తిప్పన్న, నెడ్ క్యాప్ డైరెక్టర్ మాధవరెడ్డి, వైసిపి కన్వీనర్ రంగారెడ్డి, మెప్మా అధ్యక్షురాలు సాయిలీల, కౌన్సిలర్లు, మెప్మా సిఎంఎం, సిఒలు పాల్గొన్నారు.

గోవా గవర్నర్ శ్రీధరన్ పిళ్లైకు బొకే అందజేసి స్వాగతం పలుకుతున్న ఆర్‌జె. రత్నాకర్

# పుట్టపర్తిలో గోవా గవర్నర్

## ఓనం వేడుకల ప్రారంభంలో పాల్గొన్న గవర్నర్ దంపతులు

**ప్రజాశక్తి పుట్టపర్తి అర్బన్**

గోవా గవర్నర్ శ్రీధరన్ పిళ్లై దంపతులకు ప్రశాంతి నిలయంలో ఘనస్వాగతం లభించింది. బెంగళూరు నుంచి ఆదివారం సాయంత్రం 4 గంటలకు గవర్నర్ దంపతులు ప్రశాంతి నిలయంలోని శాంతిభవన్ అతిథిగృహానికి చేరుకున్నారు. అక్కడ జిల్లా ఎస్పీ మాధవరెడ్డి, డిఎస్‌పి వాసుదేవన్, ఆర్డీవో భాగ్యరేఖ, సత్యసాయి మేనేజింగ్ ట్రస్టీ ఆర్‌జె రత్నాకర్, తహశీల్దార్ నవీన్ కుమార్ తదితరులు గోవా గవర్నర్‌కు స్వాగతం పలికారు. పోలీస్ వారి గౌరవ వందనం స్వీకరించిన అనంతరం గవర్నర్ దంపతులు సాయి కుల్వంత్ హాలులో సత్యసాయి మహాసమాధిని దర్శించుకున్నారు. కేరళీయులు జరుపుకుంటున్న ఓనం పండుగ వేడుకల్లో గవర్నర్ దంపతులు పాల్గొన్నారు. కేరళీయులు తమ సాంప్రదాయ దుస్తులు ధరించి పండుగను జరుపుకున్నారు. అనంతరం సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. గవర్నర్ దంపతులు తిరిగి కారులో రోడ్డు మార్గాన కర్నాటక రాష్ట్రంలోని చిక్ బలాపురానికి బయలుదేరి వెళ్లారు.

# జిల్లాలో 64,029 గృహ నిర్మాణాలు లక్ష్యం

## జిల్లా హౌసింగ్ పీడీ చంద్రమౌళి రెడ్డి

చంద్రమౌళిరెడ్డి

**ప్రజాశక్తి పుట్టపర్తి అర్బన్**

సత్యసాయి జిల్లాలో ఈ ఏడాది డిసెంబర్ ఆఖరుకు 64,029 గృహాలు నిర్మించాలన్నది లక్ష్యంగా పెట్టుకున్నామని జిల్లా గృహ నిర్మాణ శాఖ ప్రాజెక్టు డైరెక్టర్ చంద్రమౌళిరెడ్డి తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా ఈనెల 30న సుమారు 5 లక్షల సామూహిక గృహప్రవేశాలు లబ్ధిదారులతో చేయించాలని ప్రభుత్వ నిర్ణయం తీసుకుంది. ఎంతో ప్రతిష్టాత్మకంగా జగనన్న కాలనీలు నిర్మించాలన్నది ప్రభుత్వం లక్ష్యం కాగా ఈనెల 30న సామూహిక గృహప్రవేశాలు చేపట్టామన్నారు. నియోజకవర్గానికి ఒక లేఅవుట్ లో నిర్మించిన జగనన్న కాలనీలను ఆయా నియోజకవర్గాల ప్రజాప్రతినిధులు, అధికారులు ప్రారంభించనున్నారు. సత్యసాయి జిల్లాలో నిర్మించిన గృహాలను ప్రారంభించనున్న సందర్భంగా జిల్లా గృహ నిర్మాణ శాఖ ప్రాజెక్టు డైరెక్టర్ చంద్రమౌళి రెడ్డి ప్రజాశక్తికి ఇచ్చిన ముఖాముఖి ఇంటర్వ్యూలో పలు అంశాలను వివరించారు.

**ప్రశ్న : జిల్లాలో ఎన్ని గృహాలు నిర్మిస్తున్నారు?**

**జవాబు :** జిల్లా వ్యాప్తంగా ఈ ఏడాది డిసెంబర్ ఆఖరికి 64,029 గృహాలు నిర్మించాలని లక్ష్యంగా పెట్టుకున్నాము. ఉన్నత అధికారులు ఇచ్చిన ఆదేశాల మేరకు ఇప్పటికే 15,451 గృహాలు నిర్మించాలన్న లక్ష్యాన్ని పూర్తి చేశాం. మిగతావి ఈ ఏడాది ఆఖరుకు పూర్తి చేస్తాము.

**ప్ర: ఈనెల 30న ఎక్కడ ప్రారంభించనున్నారు.?**

**జ :** ఈనెల 30న రాష్ట్ర వ్యాప్తంగా దాదాపు 5 లక్షల గృహాలను ప్రభుత్వం ప్రారంభించనుంది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి అమరావతి నుంచి ప్రారంభించనున్నారు. అదే రోజు అన్ని జిల్లాలలోను పూర్తి అయిన గృహాలను ప్రజాప్రతినిధులు, అధికారులు ప్రారంభించనున్నారు. సత్యసాయి జిల్లాలో గోరంట్ల మండలం లోని మల్లాపల్లి లేఅవుట్లో పూర్తి అయిన 247 గృహాలను ప్రారంభించాలని ఉన్నతాధికారులు నిర్ణయించారు. ఆ కాలనీలో రహదారులు, విద్యుత్, తాగునీరు, తదితర మౌలిక సదుపాయాలను కల్పించాం. ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు జిల్లా కలెక్టర్ తదితర అధికారులు పాల్గొననున్నారు. జిల్లా కలెక్టర్ అరుణ్ బాబు ఆదేశాల మేరకు ఆయా శాఖల అధికారులు ఇప్పటికే తగిన చర్యలు తీసుకున్నారు. ఇప్పటివరకు 15,451 గృహాలు జిల్లా వ్యాప్తంగా పూర్తి అయ్యాయి.

**ప్ర: వివిధ దశల్లో నిర్మాణంలో ఎన్ని గృహాలు ఉన్నాయి.?**

**జ :** బిపిఎల్ క్రింద 21,339, బేస్మెంట్ లెవెల్ క్రింద 4,539, మూత వేసినవి 1624, పూర్తి అయినవి 14,411 గృహాలు ఉన్నాయి. ఇంకా మొదలు కానివి 4859 ఉన్నాయి. వచ్చే డిసెంబర్ నాటికి కేటాయించిన లక్ష్యాన్ని పూర్తిచేసే దిశగా చర్యలు తీసుకుంటున్నాం.

**ప్ర: ఒక్కో గృహానికి ప్రభుత్వం ఎంత ఇస్తుంది? ఆ మొత్తం సరిపోతుందంటారా.?**

**జ :** ప్రభుత్వం ఒక్కొక్క గృహానికి రూ. 1.80 లక్షలు ఇస్తోంది. ఇది కాక స్వయం సహాయక సంఘాల ద్వారా 25 వేల రూపాయలు, మరో 20 వేలు బ్యాంకు రుణం మొత్తం కలిపి రూ.2.25 లక్షలతో నిర్మాణం చేసుకోవచ్చు. లబ్ధిదారులు కొంత మొత్తం కలుపుకుంటే మరింత బాగా నిర్మించుకోవచ్చు. ప్రభుత్వ లెక్కల ప్రకారం మంజూరు చేస్తున్న మొత్తం సరిపోతుంది. లబ్ధిదారులైన నిర్మించుకోవచ్చు, లేదా ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఏజెన్సీ ద్వారా అయినా నిర్మించుకోవచ్చు.

**ప్ర: జిల్లా ప్రజలకు మీరిచ్చే సూచనలు సలహాలు ఏమిటి.?**

**జ :** ఇల్లు లేని పేదవారి సొంతింటికల నెరవేర్చాలన్నదే ప్రభుత్వ ధ్యేయం. ఆ కల నెరవేర్చుకోవడానికి లబ్ధిదారులు ముందుకు వచ్చి గృహ నిర్మాణాలు పూర్తి చేసుకోవాలి. ఇదొక బృహత్తర పథకం. దీన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరుతున్నాం.

ప్రజాశక్తి
www.prajasakti.com



## 28న మాచిదేవి ఆలయంలో కుంభాభిషేకం

**ప్రజాశక్తి-మడకశిర రూరల్**

అమరాపురం మండల పరిధిలోని చిట్టినడుకు గ్రామంలో వెలసిన జగద్గురు మడివాడ మాచిదేవి దేవాలయంలో ఈ నెల 28వ తేదీ కుంభాభిషేకం కార్యక్రమం ఉంటుం దని ఆలయ ధర్మకర్త, సిద్దేశ్వర దేవాలయ కమిటీ సభ్యుడు మూర్తి తెలిపారు. కావున ఆ రోజు ఉదయం 4 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకూ నిర్వహించనున్న పూజా కార్యక్రమాల్లో భక్తులు పెద్దఎత్తున పాల్గొని విజంతం చేయాలని కోరారు. భక్తులకు అన్నదాన కార్యక్రమం ఉంటుందని ఆయన తెలిపారు.

## ఎమ్మెల్యే తేనేటి విందుకు ఎమ్మెల్సీ

**కదిరి అర్బన్ :** ఎమ్మెల్యే డాక్టర్ పివి సిద్ధారెడ్డి ఆదివారం పట్టణంలోని తన వ్యక్తిగత కార్యాలయంలో ఏర్పాటు చేసిన తేనేటి విందులో కృష్ణ, గుంటూరు జిల్లాల టీచర్ ఎమ్మెల్సీ కల్పలతా రెడ్డి పాల్గొన్నారు. కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. అనంతరం ఉపాధ్యాయులు స్థానిక రోడ్డు భవనాల అతిథి గృహ ఆవరణలో ఎమ్మెల్సీని సత్కరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ సంఘం నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, తిరుపాల్‌నాయక్, కృష్ణానాయక్, తదితరులు పాల్గొన్నారు.

## వజ్ర ఫౌండేషన్ ఆధ్వర్యంలో కంటి వైద్యశిబిరం

**కదిరి టౌన్ :** వజ్ర ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం పట్టణంలోని ప్రభుత్వ బాలికల పాఠశాలలో కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా వజ్ర భాస్కర్ రెడ్డి మాట్లాడుతూ వజ్ర ఫౌండేషన్ ద్వారా ఇప్పటి దాకా 65 వేల మందికి పైగా ఆపరేషన్లు చేయించామన్నారు. కంటి ఆపరేషన్ చేయించుకున్న ప్రతి ఒక్కరూ నెల రోజుల పాటు నల్ల అద్దాలు ధరించి గాలి, దుమ్ము, ధూళి, పొగ తగలకుండా తగిన జాగ్రత్తలు పాటించాలని సూచించారు.

## ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు దరఖాస్తుల ఆహ్వానం

**కొత్తచెరువు :** ప్రభుత్వ ఎయిడెడ్ పాఠశాలల్లో పదేళ్ళ పైబడి పని చేసిన ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుల కోసం ఆగస్టు 29వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలని డిఇఒ మీనాక్షి తెలిపారు. జడ్పి హైస్కూల్, ప్రాథమిక, ఉన్నత, మండల ప్రాథమిక, పురపాలక, ఎబిఎంఎస్, కెజిబివి, ఎపిఆర్ఎస్ పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులు నియమ నిబంధనల మేరకు దరఖాస్తు పూర్తి చేసి జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో అందజేయాలని ఆమె తెలిపారు.

## ఒపిఎస్ అమలు చేయాలి : డిటిఎఫ్

**ఓబుళదేవరచెరువు :** పాత పెన్షన్ విధానాన్ని(ఒపిఎస్) అమలు చేయాలని డెమోక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్(డిటిఎఫ్) జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గౌస్‌లాజమ్, సురేష్‌బాబు కోరారు. సిపిఎస్‌ను రద్దు చేయకపోగా జిపిఎస్ అనే కొత్త పథకాన్ని తెరమీదకి తెచ్చారని, ఒపిఎస్ కంటే ఎక్కువ ప్రయోజనాలు జిపిఎస్‌లో ఉన్నాయని తెలుపుతున్న ప్రభుత్వం జిపిఎస్ బదులు ఒపిఎస్‌ను అమలు చేస్తే సరిపోతుంది కదా అన్నారు. జిపిఎస్ విధానంలో కూడా ఎంప్లాయిస్ కాంట్రిబ్యూషన్, ప్రభుత్వ కాంట్రిబ్యూషన్ రెంగూ ఎన్ఎస్‌డిఎల్ సంస్థకు పంపుతారని, మార్కెట్ ఒడిదుడుకుల కారణంగా అనుకున్నంత పెన్షన్ ఇవ్వడం గ్యారెంటీ ఉండదని డిటిఎఫ్ అభిప్రాయ పడుతుందన్నారు. కావున ఒపిఎస్‌ను మాత్రమే అమలు చేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

## 2న మండల సర్వసభ్య సమావేశం

**బత్తలపల్లి :** స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో సెప్టెంబర్ 2వ తేదీ(శనివారం) ఉదయం 10 గంటలకు ఎంపిపి బగ్గిరి త్రివేణి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపిడిఒ సౌజన్యకుమారి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. సమావేశానికి మండలంలోని ప్రజా ప్రతినిధులు అందరూ తప్పక హాజరు కావాలని కోరారు. అలాగే మండలంలోని అన్ని శాఖల అధికారులు తమ శాఖల ప్రగతి నివేదికలతో హాజరు కావాలని, ఎవ్వరూ గైరాజరు కావద్దని సూచించారు.

## బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

**పుట్టపర్తి రూరల్ :** మండల పరిధిలోని కొట్లపల్లి గ్రామానికి చెందిన టిడిపి నాయకుడు తలారి సోము శనివారం గుండెపోటుతో మృతి చెందాడు. ఈ విషయం తెలియడంతో ఆదివారం మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి కొట్లపల్లి గ్రామం వెళ్లి అతని కుటుంబాన్ని పరామర్శించి భార్యకు ఆర్థిక సాయం అందజేశారు. పార్టీ కూడా అండగా ఉంటుందని తెలిపారు. పల్లె వెంట మండల కన్వీనర్ విజయ్‌కుమార్, యువ నేత కంసల నారాయణస్వామి, రామయ్య, ఆటో గంగాద్రి, మాజీ ఎంపిటిసి నాగిరెడ్డి, తిప్పన్న, తదితరులు ఉన్నారు.

## కళ్యాణ మండపం నిర్మాణానికి విరాళం

**ప్రజాశక్తి-మడకశిర**

రొళ్ల మండల పరిధిలోని కాలువేపల్లి గ్రామంలో నిర్మించతలపెట్టిన లక్ష్మీరంగనాథస్వామి కళ్యాణ మండపానికి ఆదివారం బెంగళూరులో నివాసం ఉంటున్న రఘు కుటుంబ సభ్యులు రూ. 25 వేలు విరాళం అందజేశారు. దాతలకు ఆలయ కమిటీ నిర్వాహకులు ధన్యవాదాలు తెలిపారు. కళ్యాణ మండపం నిర్మాణానికి భక్తులు తమ వంతుగా ఆర్థిక సాయం అందజేయాలని ఆలయ కమిటీ నిర్వాహకులు హెచ్‌టి హళ్లి ఎస్.రంగప్ప, రమేష్, కాలువేపల్లి రాజన్న, తదితరులు ఉన్నారు.

కళ్యాణమండం నిర్మాణానికి విరాళం అందజేస్తున్న దాత

## సత్యసాయి నీటి సరఫరా కార్మికుల వినూత్న నిరసన

**ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్**

సత్యసాయి తాగునీటి సరఫరా కార్మికులు పొర్లుదండాలతో వినూత్నంగా నిరసన చేపట్టారు. సమ్మెలో భాగంగా మూడవరోజైన ఆదివారం పట్టణంలోని పంప్ హౌస్ వద్ద సత్యసాయి చిత్రపటాన్ని ఉంచి పూజలు నిర్వహించారు. అలాగే ప్రజల దాహార్తి తీర్చడానికి నీవు ఏర్పాటు చేసిన తాగునీటి పథకాన్ని నీవే కాపాడు స్వామి, సిఎం జగన్‌కి మంచి బుద్ధి ప్రసాదించమని పొర్లు దండాలు చేశారు. ప్రభుత్వం ఇకనైనా కళ్లు తెరిచి కార్మికులకు రావాల్సిన బకాయిలు చెల్లించి పథకాన్ని సక్రమంగా నిర్వహించాలని కోరారు. ఈ సమ్మెతో ప్రజలకు తాగునీరు అందక తీవ్ర ఇబ్బంది పడుతున్నారాన, అయితే ఐదు నెలల వేతనాలు ఇవ్వకుంటే తాము ఏమి తిని బతకాలని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో అధ్యక్షులు మధు, ప్రభు, వేణు, చంద్ర, శ్రీనివాస్, తిరుపాల్, హరి, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

**తాగునీటి పథకాన్ని నిర్వీర్యం చేస్తున్న ప్రభుత్వం : పల్లె**

ప్రజల దాహార్తి తీర్చడానికి సత్యసాయి ఆనాడు కోట్లాది రూపాయలతో నిర్మించిన నీటి పథకాన్ని ప్రభుత్వం నిర్వీర్యం చేస్తుందని మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. పల్లె ఆదివారం స్థానిక టిడిపి కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ ఈ పథకాన్ని సక్రమంగా నిర్వహించ లేని స్థితిలో ప్రభుత్వం ఉండటం సిగ్గుచేటు అన్నారు. టిడిపి హయాంలో కార్మికుల వేతనాలు, పిఎఫ్, ఈఎస్ఐ సక్రమంగా అమలు చేసిందన్నారు. ఈ పథకం కింద 572 మంది కార్మికులు పని చేస్తున్నారని వారందరికీ పెండింగ్‌లో ఉన్న వేతనాలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు.

పొర్లుదండాలతో నిరసన తెలుపుతున్న సత్యసాయి నీటి సరఫరా కార్మికులు

## సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత

### ఎమ్మెల్యే తిప్పేస్వామి

**ప్రజాశక్తి-మడకశిర**

గ్రామస్థాయిలో సమస్యల పరిష్కారానికి తొలి ప్రాధాన్యత కల్పిస్తామని ఎమ్మెల్యే తిప్పేస్వామి తెలిపారు. మండల పరిధిలోని ఉప్పిడిపల్లి గ్రామంలో ఆదివారం నిర్వహించిన 'గడప గడపకూ మన ప్రభుత్వం' కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన ఇంటింటికీ వెళ్లి ప్రజలకు సంక్షేమ పథకాలను వివరించి లబ్ధి పొందిన బుక్‌లెట్‌ను అందజేశారు. అలాగే వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం అమలు చేస్తు న్న సంక్షేమ పథకాలు పేదలకు కొండంత భరోసా కల్పించి వారి జీవితాల్లో వెలుగులు నింపుతున్నాయన్నారు. ఎన్నికలకు ముందు ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చి ప్రజా సంక్షేమ ప్రభుత్వమని నిరూపించామన్నారు. పార్టీలకు అతీతంగా ప్రతి పథకం అర్హులకు అందజేస్తున్నామన్నారు. మహిళలని మహారాణులుగా మార్చాలన్న లక్ష్యంతో అన్నిరంగాల్లో పెద్దపీట వేశామన్నారు. డ్వాక్రా సంఘాల వడ్డీతో పాటు రుణమాఫీ చేసిన ఘనత సిఎం జగన్‌కే దక్కుతుందన్నారు. గ్రామాల్లో ప్రజలు తెలియజేసిన ప్రధాన సమస్యలకు వెంటనే పరిష్కారం చూపాలని అధికారులకు సూచించారు. ముఖ్యంగా తాగునీటి సమస్యపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఎక్కడైనా సమస్య తీవ్రంగా ఉంటే కొత్త బోరు వేయిస్తామన్నారు. కార్యక్రమంలో ఎంపిపి కవితా సత్యనారాయణరెడ్డి, సర్పంచి తిమ్మారెడ్డి, జిల్లేడుగుంట మంజునాథ్, ప్రజాప్రతినిధులు, సచివాలయ సిబ్బంది, వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

'గడప గడపకూ' కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే తిప్పేస్వామి

## సిఎం జగన్ చిత్రపటానికి పాలాభిషేకం

**ప్రజాశక్తి-కదిరి టౌన్**

కాంట్రాక్ట్ ఉద్యోగులను రెగ్యులర్ చేయడంపై హర్షం వ్యక్తం చేస్తూ ఆదివారం పట్టణంలో సిఎం జగన్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. పట్టణంలోని ఆర్ అండ్ బి బంగ్లాలో ఆదివారం వివిధ ఉపాధ్యాయ సంఘాల నాయకులు, మండలాల విద్యాశాఖ అధికారులు, ఉన్నత పాఠశాలల హెచ్‌ఎంలు, పిడిలు, లాంగ్వేజ్ పండిట్లు డిగ్రీ, జూనియర్ కళాశాలల అధ్యాపకులు, కాంట్రాక్ట్ అధ్యాపకులు, కెజిబివి ఉద్యోగులు, డేటా ఎంట్రీ ఆపరేటర్లు, సిఆర్పీలు, ఎంఐఎస్, తదితరులతో ఏర్పాటు చేసిన సమావేశానికి ఎమ్మెల్సీ కల్పలతారెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీని ఉద్యోగులు పూలమాలలు, దుశ్శాలువాలతో సన్మానించారు. అనంతరం ఎమ్మెల్సీ ఉద్యోగులతో కలిసి సిఎం జగన్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ తానెప్పుడూ మీ అందరికీ అందుబాటులో ఉంటానన్నారు. మీ సమస్యలు ఫోన్ ద్వారా తెలిపినా పరిష్కారానికి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానన్నారు. సమస్యల పరిష్కారం కోసం చిత్తశుద్ధితో కృషి చేస్తానన్నారు. కాంట్రాక్ట్ ఉద్యోగుల రెగ్యులరైజేషన్, మహిళా ఉపాధ్యాయులకు సర్వీస్ మొత్తంలో సిసిఎల్ వినియోగం, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు జీతాల పెంపు, ఉపాధ్యాయుల ప్రమోషన్లు, మున్సిపల్ ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయు లకు డిడిఓ అధికారాలు, ఎంఇఒ-2 పోస్టుల మంజూరు, ఉపాధ్యాయుల బదిలీలు, తదితర సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించామన్నారు. త్వరలో ఖాళీగా ఉన్న సిఆర్పి పోస్టులను కూడా భర్తీ చేస్తామన్నారు. కెజిబివి సిబ్బంది, డేటా ఎంట్రీ ఆపరేటర్లు, ఎంఐఎస్ కోఆర్డినేటర్లు, సిఆర్పీలు, మెసెంజర్‌లకు వేతనాలు పెంచే విషయమై తనవంతు కృషి చేస్తానని తెలిపారు. ఎంఇఒ-2లు, బదిలీ ఉపాధ్యాయుల బకాయి వేతనాలు ఈ నెలలో వారి ఖాతాలో జమయ్యేలా చూస్తామన్నారు. అనంతరం ఉపాధ్యాయ సంఘాలు, పలువురు ఎమ్మెల్సీకి వినతులు అందజేశారు.

## సర్వే నెంబర్-83పై నిగ్గు తేల్చండి : ఆర్‌సిపి

**ప్రజాశక్తి-కదిరి టౌన్**

పట్టణ పరిధిలోని సర్వేనెంబర్-83లో చోటు చేసుకున్న భూ అక్రమాలపై నిగ్గు తేల్చాలని రాయలసీమ కమ్యూనిస్టు పార్టీ(ఆర్‌సిపి) జిల్లా కార్యదర్శి నాగన్న డిమాండ్ చేశారు. పట్టణంలోని పార్టీ కార్యాలయంలో ఆదివారం కదిరి డివిజన్ కార్యదర్శి టిఎండి ఇలియాజ్ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నాగన్న మాట్లాడుతూ కదిరి రెవెన్యూ గ్రామ పొలం సర్వే నెంబర్-83లో ఇళ్ల పట్టాల వ్యవహారంలో రూ. కోట్లు చేతులు మారాయని ఆరోపించారు. ఈ సర్వే నెంబర్‌కు కూతవేటు దూరంలో బైపాస్ రోడ్డు రావడంతో అక్రమార్కుల కన్నేశారన్నారు. ఈ సర్వే నెంబర్‌లో ఉన్న గుట్టపోరంబోకు భూమిని గుట్టుగా అమ్ముకోవడానికి భూకబ్జాదారులు కొందరు రెవెన్యూ అధికారులతో కలిసి భూ దందాకు తెర లేపారని విమర్శించారు. ఈ క్రమంలో పట్టాలు సృష్టించి వందలాది మంది రూ. లక్షలు తీసుకొని అమాయకులకి పట్టాలు ఇచ్చారన్నారు. ఒకొక్కరికి 2 నుంచి 5 సెంట్ల వరకు పట్టాలిచ్చారు. ఈ వ్యవహారంలో దళారీగా వ్యవహరిస్తున్న ప్రయివేట్ వ్యక్తి పట్టాల వ్యహారంలో డబ్బు ముట్టజెబుతున్న ఆధారాలను ఈ సందర్భంగా వీడియో విడుదల చేశారు. ఈ వ్యవహారంపై విచారణ జరిపించి అక్రమాలకు పాల్పడిన రెవెన్యూ అధికారులు, భూకబ్జాదారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రాయలసీమ మహిళా సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు గంగులమ్మ, కె.సుగుణమ్మ, కదిరి డివిజన్ నాయకులు బత్రాపేట ఆంజనేయులు, గంగన్న, ఆనంద్, శంకరప్ప, రవణమ్మ, తదితరులు పాల్గొన్నారు.

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఆర్‌సిపి నాయకులు

## హిందూపురం రూరల్ సిఐగా వై.శ్రీనివాసులు

సిఐ వై.శ్రీనివాసులు

**హిందూపురం :** హిందూపురం రూరల్ అప్‌గ్రేడ్ పోలీస్ స్టేషన్ సిఐగా వై.శ్రీనివాసులు ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేస్తున్న సిఐ కృష్ణారెడ్డి బదలీపై చిత్తూరు జిల్లాకు వెళ్లారు. ఈ స్థానంలో హిందూపురం టూటౌన్ సిఐగా పని చేస్తున్న వై.శ్రీనివాసులును అధికారులు నియమించారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం సిఐ మాట్లాడుతూ మండల వ్యాప్తంగా శాంతి భద్రతల పరిరక్షణ కోసం కృషి చేస్తానని తెలిపారు. అలాగే మండలంలో ఎన్ని గ్రామ పంచాయతీలు ఉన్నాయి, తదితర విషయాలను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు.

## కార్మికుల సంక్షేమమే లక్ష్యం

### వైఎస్ఆర్ ట్రేడ్ యూనియన్ నాయకులు బత్తల కోదండరామిరెడ్డి

**ప్రజాశక్తి-మడకశిరరూరల్**

కార్మికుల సంక్షేమమే లక్ష్యంగా గత 30 ఏళ్లుగా పని చేస్తున్నానని వైయస్సార్ ట్రేడ్ యూనియన్ నాయకులు, మలేరియా సబ్‌యూనిట్ అధికారి బత్తుల కోదండరామిరెడ్డి పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన ప్రజాశక్తితో మాట్లాడుతూ యూనియన్ నాయకుడిగా తాను చేసిన కృషిని వివరించారు. 1970 జనవరి 26వ తేదీన బత్తులల వెంకట్రామిరెడ్డి వెంకటలక్ష్మి మూడవ సంతానమైన కోదండరామిరెడ్డి అనంతపురం జిల్లాలో మూడు దశాబ్దాలుగా ఐఎన్టీయూసీకి ఉమ్మడి అనంతపురం జిల్లాలోనూ జిల్లా కార్యదర్శిగా జిల్లా అధ్యక్షుడిగా పనిచేశారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఐఎన్‌టియుసి కమిటీ ప్రధాన కార్యదర్శి హోదాలో పనిచేస్తూ వేలాది మంది ఉద్యోగుల కార్మికుల సమస్యల పరిష్కారం కోసం కృషి చేశారు. గత 35 సంవత్సరాల నుంచి కార్మిక నాయకునిగా కార్మికుల హక్కుల పరిరక్షణ కోసం పోరాడారు. కోదండరామిరెడ్డి అనంతపురం జిల్లాలో ఐఎన్టీయూసీని బలోపేతం చేసిన వ్యక్తులలో మొదటివాడిగా పరిగణింపబడుతున్నారు. అనంత పురం జిల్లా గుత్తి పట్టణంలో జన్మించిన కోదండరామిరెడ్డి 20 సంవత్సరం వయసులోనే కార్మిక నాయకుడిగా గుర్తింపుపొందాడు. జిల్లా ఐఎన్టీయూసీ కమిటీ కార్యదర్శిగా 1992 సంవత్సరంలో అప్పటి జిల్లా అధ్యక్షులు కల్లికుల్లా ఖాన్ నియమించారు. ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ హెల్త్ అండ్ మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర కమిటీ ప్రధాన కార్యదర్శిగా 2002లో ఎంపికయ్యారు. కాంగ్రెస్ పార్టీ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ నుంచి తెలంగాణను విభజించినప్పుడు రాష్ట్ర ఎన్ టి సి కమిటీ ప్రధాన కార్యదర్శి పదవికి రాజీనామా చేసి వైఎస్సార్ ట్రేడ్ యూనియన్ పార్టీని అనంతపురంలో స్థాపించారు. ప్రస్తుతం వైయస్సార్ ట్రేడ్ యూనియన్ జిల్లా నాయకునిగా ఉంటూ వైఎస్సార్ ట్రేడ్ యూనియన్ అనుబంధ సంస్థ ఏపీ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులుగా ఉద్యోగులతో ఏకగ్రీవంగా ఎన్నుకోబడ్డాడు. కోదండరాం రెడ్డి గ్రంథాలయ ఉద్యమ అభివృద్ధికై విశేష సేవలు చేశారు.

## రక్తదానంపై అవగాహన

**ప్రజాశక్తి-ధర్మవరం టౌన్**

ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో ఆదివారం సంచార వాహనం ద్వారా పట్టణ ప్రజలకు రక్తదానంపై అవగాహన కల్పించడంతో పాటు రక్తాన్ని సేకరించారు. రక్త దాతల వద్దకే ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ వాహనం రావడం శుభ పరిణామమని సొసైటీ జిల్లా వైస్ ఛైర్మన్ ఓలా ప్రభాకర్, పట్టణ ఛైర్మన్ డాక్టర్ నరసింహులు, వైస్ ఛైర్మన్ నరేందర్‌రెడ్డి, కార్యదర్శి శివయ్య, కోశాధికారి డాక్టర్ సత్య నిర్ధారన్ పేర్కొన్నారు. ఈ వాహనాన్ని తొలుత పోలా ప్రభాకర్ ప్రారంభించగా నరేందర్‌రెడ్డితో పాటు వారి కుమారుడు రక్తదానం చేశారు. అనంతరం ఈ వాహనం మెహర్ బాబా సెంటర్, కళాజ్యోతి, కదిరి గేటు, తదితర ప్రధాన కూడళ్ల వద్ద దాతల నుంచి రక్తాన్ని సేకరించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ ఎపిలో ఇండియన్ రెడ్ క్రాస్ సంస్థ ప్రాధాన్యతను గుర్తించిన ప్రభుత్వం చిత్తూరు, అనంతపురం, పుట్టపర్తి ఉమ్మడి జిల్లాలకు రెండు వాహనాలను పంపిందని తెలిపారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో రక్తదానం ఇచ్చే సమాచారాన్ని బట్టి ఈ వాహనం అక్కడికే వస్తుందని తెలిపారు. గ్రామీణ ప్రాంతాలలో 30 మంది పట్టణ ప్రాంతాలలో 50 మంది రక్త దాతలు ఉంటే నేరుగా ఈ వాహనం అక్కడకు చేరుకుంటుందని తెలిపారు. మున్ముందు కళాశాలలు, పాఠశాలలు, వివిధ క్లబ్‌లు, స్వచ్ఛంద సేవా సంస్థలకు రక్తదానంపై పూర్తిస్థాయిలో అవగాహన కల్పించి, రక్త సేకరణలో విజయం సాధిస్తామని తెలిపారు. కార్యక్రమంలో యువర్స్ ఫౌండేషన్ అధ్యక్షులు వైకె శ్రీనివాసులు, కార్యదర్శి సుకుమార్, ఇండియన్ రెడ్ క్రాస్ వాహన సిబ్బంది వన్నూరుస్వామి, శ్రీకాంత్, రఘువీర్, భాస్కర్, రమాదేవి, తదితరులు పాల్గొన్నారు.

మడకశిరలో రఘువీరారెడ్డిని కలిసిన ఎన్ఎస్‌యుఐ, కాంగ్రెస్ నాయకులు

## రఘువీరాను కలిసిన ఎన్ఎస్‌యుఐ నాయకులు

**ప్రజాశక్తి-మడకశిర**

కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ కమిటీ సభ్యును ఎన్.రఘువీరారెడ్డిని ఆదివారం మడకశిర పట్టణంలో ఎన్ఎస్‌యుఐ నాయ కులు కలిశారు. ఈ సందర్భంగా రఘువీరా వారితో మాట్లాడుతూ తాను కూడా విద్యార్థి సంఘం నాయకుడిగా పని చేశానని తెలిపారు. కలిసిన వారిలో ఎన్ఎస్‌యుఐ జిల్లా ప్రధాన కార్యదర్శి తిమ్మాపురం నవీన్, జిల్లా నాయకులు అజయ్‌కుమార్, సాకే ఉపేంద్ర, పవన్, జోగి, విష్ణు పాల్గొన్నారు.

**కదిరి అర్బన్ :** సిడబ్ల్యూసి సభ్యులు రఘువీరారెడ్డిని కదిరి నియోజకవర్గ సమన్వయకర్త పిఎస్ అహ్మద్‌హుస్సేన్, నచ్చు బాలకృష్ణ కలిశారు. ఈ సందర్భంగా రఘువీరా మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీకి మంచి రోజులు రాబోతున్నాయని, కావున ప్రతిఒక్కరూ పార్టీ బలోపేతానికి గ్రామ స్థాయి నుంచి కృషి చేయాలని సూచించారు. త్వరలోనే నియోజకవర్గ స్థాయిలో సమావేశాలు ఏర్పాటు చేయడానికి సిద్ధమవుతున్నామన్నారు.

విధులు బహిష్కరించి నిరసన తెలుపుతున్న సత్యసాయి నీటి సరఫరా కార్మికులు

## కొనసాగిన సత్యసాయి తాగునీటి కార్మికుల ధర్నా

**ప్రజాశక్తి-ముదిగుబ్బ**

వేతనాలు చెల్లించాలని కోరుతూ సత్యసాయి తాగునీటి పథకం కార్మికులు చేపట్టిన ధర్నా మూడవ రోజైన ఆదివారం కూడా కొనసాగింది. కార్మికులు మండల కేంద్రమైన ముదిగుబ్బలోని సత్యసాయి పంప్ హౌస్ ఎదుట నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఐదు నెలలుగా పెండింగ్‌లో ఉన్న వేతనాలు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. ధర్నాలో మండలంలోని సత్యసాయి తాగునీటి పథకం కార్మికులు సూర్యనారాయణ, శివయ్య, చంద్ర, గంగాధర్, తిరుపాల్, నాగరాజు, అల్లిపీరా, తదితరులు పాల్గొన్నారు.

## ఓటరు దరఖాస్తుల పరిశీలన

**ప్రజాశక్తి-హిందూపురం**

ఇంటింటి సర్వే ద్వారా బిఎల్‌ఒలు సేకరించిన ఓటరు జాబితా వివరాలను తహశీల్దార్ హసీనాసుల్తానా, మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వరరావు పరిశీలించారు. స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో ఆదివారం పోలింగ్ బూత్‌ల వారీగా అందిన నూతన ఓటరు దరఖాస్తులను, పోలింగ్ బూత్‌ల వారీగా పరిశీలించారు. అలాతే సర్వేలో అందిన ఓటరు నమోదు దరఖాస్తుల లో నూతన ఓటరు నమోదు, సవరణ, తదితర దరఖాస్తులను వేర్వేరుగా ఉంచి వాటి ఆధారంగా తప్పులు లేని ఓటరు జాబితాను సిద్ధం చేయాలని సిబ్బందికి సూచించారు.

దరఖాస్తులను పరిశీలిస్తున్న కమిషనర్, తహశీల్దార్

## టిటిడి పాలక మండలి నుంచి అవినీతిపరులను తొలగించాలి

**ప్రజాశక్తి-మడకశిర రూరల్**

అవినీతి ఆరోపణలు ఉన్న వ్యక్తులను తిరుమల తిరుపతి దేవస్థానం పాలక మండలి నుంచి తక్షణమే తొలగించాలని టిఎన్ఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు పి.మురళిబాబు డిమాండ్ చేశారు. పట్టణంలోని టిఎన్ఎస్ఎఫ్ కార్యాలయం వద్ద ఆదివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ భక్తుల కొంగుబంగారంగా కొలిచే కలియుగ ప్రత్యక్ష దైవం వెంకటేశ్వరస్వామి సన్నిధిలో నిస్వార్థంగా భక్తులకు సేవ చేసే వ్యక్తులు, ధర్మాన్ని కాపాడే వ్యక్తులకు టిటిడి పాలక మండలిలో సభ్యులుగా చోటు కల్పించాలన్నారు. అలాంటి ధర్మ సన్నిధిలో లిక్కర్ స్కాం నిందితులకు, అవినీతి ఆరోపణలు ఉన్న వ్యక్తులకు, ధనాన్ని ఆశించి సేవా కార్యక్రమాలు చేసే వారికి చోటు కల్పించడం దుర్మార్గమన్నారు. టిటిడి పవిత్రతను కాపాడాలంటే అవినీతి రహిత వ్యక్తులకు టిటిడి పాలక మండలి సభ్యులుగా అవకాశం కల్పించాలని సూచించారు.

మురళిబాబు

# నేరాలు ఘోరాలు

## రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

**ప్రజాశక్తి-బత్తలపల్లి**

అనంతపురం-కదిరి జాతీయ రహదారిపై మండల పరిధిలోని ఉప్పర్లపల్లి క్రాస్ వద్ద శనివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. ముదిగుబ్బ మండలం గాండ్లోరెపల్లి గ్రామానికి చెందిన కార్తీక్ ద్విచక్రవాహనంపై స్వగ్రామం నుంచి బత్తలపల్లి వైపు వస్తున్నాడు. చిత్రావతి నది బ్రిడ్జిపై వేగంగా వస్తూ అదుపుతప్పి ఉప్పరపల్లికి క్రాస్ అవుతున్న గంగిరెడ్డిని ఢీ కొన్నాడు. అదే వేగంతో రోడ్డు పక్కన నుంచున్న వైస్ ఎంపిపి గజ్జెల వెంగళరెడ్డి, రామాంజనేయులు, హోటల్ నిర్వాహకుడు రంగారెడ్డిని ఢీకొన్నాడు. ఈ ప్రమాదంలో గంగిరెడ్డి గాయపడగా, రంగారెడ్డికి కాళ్లు విరిగినట్లు తెలిపారు. మిగిలిన ఇద్దరూ తృటిలో తప్పించుకున్నారు. గాయపడిన వారిని 108 వాహనంలో ఆర్‌డిటి ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

## బైక్ అదుపుతప్పి వ్యాపారికి....

**ప్రజాశక్తి-ధర్మవరం టౌన్**

పట్టణంలోని శ్రీలక్ష్మీచెన్నకేశవపురం సర్కిల్‌లో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో పండ్ల వ్యాపారి కుళ్లాయప్ప తీవ్రంగా గాయపడ్డాడు. వన్ టౌన్ పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. పట్టణంలోని లక్ష్మీనగర్‌కు చెందిన పండ్ల వ్యాపారి కుళ్లాయప్ప ద్విచక్రవాహనంపై చెన్నేకొత్తపల్లి మండలంలోని బసినేపల్లికి వెళ్లి తిరిగి ధర్మవరం వస్తున్నాడు. అయితే లక్ష్మీ చెన్నకేశవపురం సర్కిల్‌లో బైకు అదుపు తప్పి కిందకు పడ్డాడు. ఈ ప్రమాదంలో కుళ్లాయప్పతలకు తీవ్రగాయాలయ్యాయి. దీంతో స్థానికులు స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడ ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం అనంతపురం ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

## ఆర్టీసీ బస్సును ఢీ కొన్న బైక్..

**ముదిగుబ్బ :** మండల పరిధిలోని దొరిగిల్లు ఘాట్ రోడ్డు సమీపంలో ఆర్టీసీ బస్సును ద్విచక్రవాహనం ఢీకొన్న సంఘటనలో ఒకరు తీవ్రంగా గాయపడినట్లు స్థానికులు తెలిపారు. పులివెందుల వైపు నుంచి ముదిగుబ్బ వైపు వస్తున్న ఆర్టీసీ బస్సును, దొరిగిల్లు వైపు నుంచి పులివెందుల వైపు వెళ్తున్న ద్విచక్ర వాహనం ఢీకొంది. ఈ ప్రమాదంలో బైక్‌పై వెళ్తున్న నల్లగొండోరుపల్లి గ్రామానికి చెందిన మునీంద్ర తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు సమాచారం ఇవ్వడంతో 108 వాహనం లో అనంతపురం తరలించారు.

## అదుపుతప్పి కారు బోల్తా

**మడకశిర :** మండల పరిధిలోని అయ్యావారిపల్లి ప్రధాన రోడ్డు వద్ద ఆదివారం కారు అదుపుతప్పి బోల్తా పడిన సంఘటనలో ఇద్దరు గాయపడ్డారు. స్థానికులు వెంటనే వారిని మడకశిర ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించి దర్యాప్తు చేపట్టారు.

## కారును తప్పించబోయి ఈచర్..

**మడకశిర రూరల్ :** మడకశిర మండల పరిధిలోని యు.రంగాపురం ప్రధాన రోడ్డు వద్ద ఆదివారం కారును తప్పించబోయి ఈచర్ వాహనం బోల్తా పడిన సంఘటన చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో డ్రైవర్, క్లీనర్ స్వల్ప గాయాలతో బయటపడ్డారు. విషయం తెలిసిన వెంటనే పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. ఈచర్ వాహనంలో బుల్లెట్ బియ్యం ఉన్నట్లు గుర్తించారు. విచారణ తర్వాత పూర్తి వివరాలు వెల్లడిస్తామని తెలిపారు.

## జెసిబి, ట్రాక్టర్లు సీజ్

**ప్రజాశక్తి-రొద్దం**

మండల పరిధిలోని ఆర్.కొట్టాల గ్రామ సమీపంలోని అప్పిరెడ్డి కుంట నుంచి కర్నాటకలోని రాకుంట గ్రామం వద్దకు అక్రమంగా మట్టి తరలిస్తుండగా పోలీసులు పట్టుకున్నారు. ధనుంజయ, హరికృష్ణ, ఉగ్గిరప్ప ముగ్గురూ కలిసి జెసిబి సాయంతో రెండు ట్రాక్టర్ల ద్వారా ఆంధ్రాలోని మట్టిని కర్నాటకకు అక్రమంగా తరలిస్తున్నారు. ఈ విషయం తెలుసుకున్న ఎస్ఐ నాగస్వామి పోలీసు సిబ్బందితో కలిసి సంఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించి ఎటువంటి అనుమతులు లేకపోవడంతో జెసిబి, రెండు ట్రాక్టర్లను సీజ్ చేసి కేసు నమోదు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుళ్లు నాగరాజు, నాగేంద్ర పాల్గొన్నారు.

## మద్యం మత్తులో వైద్య సిబ్బందిపై దాడి

**ప్రజాశక్తి-కొత్త చెరువు**

స్థానిక ప్రభుత్వ ఆసుపత్రి సిబ్బందిపై బిసి కాలనీకి చెందిన ఓ యువకుడు ఆదివారం మద్యం మత్తులో దాడికి పాల్పడ్డాడు.. వివరాలు.. బిసి కాలనీకి చెందిన మారెప్ప అతిగా మద్యం తాగి ఇంటి వద్ద ఘర్షణ పడి కత్తితో చెయ్యి కోసుకుని తీవ్ర రక్తస్రావం అవుతున్నా పోలీస్ స్టేషన్‌కి వెళ్లాడు. దీంతో పోలీసులు చికిత్స నిమిత్తం అతడిని ఆసుపత్రికి తరలించగా వైద్య సిబ్బంది గోవిందు, స్టాఫ్ నర్స్, ఎఎన్ఎం అతడిని కుట్లు వేయడానికి ప్రయత్నించారు. అయితే అతడు మద్యం మత్తులో వారిపై కుర్చీలు, బెంచీలు, రాళ్లతో దాడి చేసి గాయపరచడంతో పాటు తీవ్ర పదజాలంతో దూషించాడు. అడ్డుకోబోయిన వారిపై కూడా దాడికి పాల్పడ్డాడు. దీంతో వారు భయభ్రాంతులకు గురై పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ లింగన్న తెలిపారు.

## పేలుడు పదార్థాలతో పాడిఆవు మృతి

**ప్రజాశక్తి-చిలమత్తూరు**

మండల పరిధిలోని దేమకేతేపల్లి ఎస్సీ కాలనీకి చెందిన ఎస్.నరసింహప్పకు చెందిన ఆవు ఆదివారం పేలుడు పదార్థాన్ని నోటితో కొరకడంతో పేలుడు సంభవించి మృతి చెందింది. పాడి రైతు, కాలనీ వాసులు తెలిపిన వివరాలు.. దేమకేతేపల్లి గ్రామ సమీపంలోని పచ్చిక బయలులో అడవి పందులను వేటాడేందుకు గుర్తు తెలియని దుండగులు పెట్టిన కేపులతో ఈ ప్రమాదం చోటు చేసుకున్నట్లు తెలిపారు. నరసింహప్ప రూ. 75 వేలు వెచ్చించి ఆవును కొనుగోలు చేయగా ఒక పూటకు 10 లీటర్ల పాలు ఇచ్చేది. ఆవు మృతితో తాము నష్టపోయామని ప్రభుత్వం ఆదుకోవాలని బాధితుడు కోరారు.

## ప్రజల్లో శాస్త్రీయ దృక్పథం పెంపొందాలి

### జెవివి జోనల్ ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఈటీ రామ్మూర్తి

**ప్రజాశక్తి-హిందూపురం**

ప్రజల్లో శాస్త్రీయ దృక్పథం పెంపొందాలని జనవిజ్ఞాన వేదిక జోనల్ ప్రధాన కార్యదర్శి ఈటీ రామ్మూర్తి పేర్కొన్నారు. పట్టణంలోని ఆర్‌పిజిటి రోడ్డులో ఉన్న అల్ హిలాల్ పాఠశాలలో ఆదివారం జెవివి జోనల్ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రామ్మూర్తి మాట్లాడుతూ చంద్రయాన్-3 విజయవంతం కావటంపై ఇస్రో శాస్త్రవేత్తలకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ విజయం దేశానికి ఎంతో గర్వకారణమన్నారు. ప్రజలు మూఢ నమ్మకాలకు దూరంగా ఉండాల న్నారు. ప్రస్తుతం దేశంలో సూడో సైన్స్ రాజ్యమేలుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. విద్యార్థులు సైన్స్‌పై అవగాహన పెంచుకొని ప్రశ్నించేతత్వాన్ని అలవర్చుకోవాలన్నారు. సంఘం జోనల్ అధ్యక్షులుగా పి.రామకృష్ణ, వెంకట్రామిరెడ్డి, గంగిరెడ్డి మాట్లాడారు. సమావేశంలో సంఘం నాయకులు ఉగ్రప్ప, శ్రీనివాసులు, మల్లికార్జున, లక్ష్మీపతి, ప్రభాకర్, పెన్నయ్య, అనిల్‌కుమార్, ఓబులేశు, తదితరులు పాల్గొన్నారు.

**నూతన కమిటీ ఎన్నిక**

సమావేశంలో సంఘం నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకొన్నారు. గౌరవాధ్యక్షులుగా ధనాపురం వెంకట్రామిరెడ్డి, గౌరవ సలహాదారుగా న్యాయవాది సిద్ధూ, అధ్యక్షులుగా పి.రామకృష్ణ, ఉపాధ్యక్షులుగా అతావుల్లా, ఉగ్రప్ప, అబ్దుల్ హక్, ఓబులేశు, గంగిరెడ్డి, ప్రధాన కార్యదర్శిగా ఈటీ రామ్మూర్తి, కార్యదర్శులుగా జిఆర్ శ్రీనివాసులు, టి.లక్ష్మీపతి, ప్రభాకర్, మురళీమోహన్, నాగరాజు, నరసింహులు సభ్యులను ఎన్నుకొన్నారు.

ఎంపికైన జెవివి నూతన కమిటీ